# ఇరువురి యొక్క చోటికే పోదము

రాయవరమున పెద్దమనుష్యులగు రైతులలో భీమారెడ్డియొకడు. అతనికి ముగ్గురు కుమారులు, నలుగురు కొమార్తెలు. కుమారులు యుక్తవయస్కులై పనిపాటలలో అతని చేతికందివచ్చిరి. కొమార్తెలందఱును సంతానవతులు. అందఱికంటెను చిన్నవాడగు జగ్గారెడ్డి పందొమ్మిది యేండ్లవాఁడు. అతనికింకను పెండ్లికాలేదు.

తిరుపతి రాయడుగూడ ఆ గ్రామమున ఒక పెద్దమనుష్యుడుగనే పరిగణింపబడుచుండెను. తిరుపతిరాయడు భీమారెడ్డి కంటె కొంచెము ధనికుడు. అతనికొక్క కొమార్తె మాత్రమే యుండెను. తనకు ఏబదియేండ్లు వచ్చినను మఱల సంతానము కలుగనందున అతడు అపుత్రికనే పుత్రుడుగా గూడ భావించుకొని ప్రాణపదముగ బెంచుకొనుచుండెను. వెంకమ్మ తలిదండ్రులు ప్రేమించిన కొలదిని వారి యెడల భయభక్తులు చూపుచు బెరుగుచుండెను.

జగ్గారెడ్డి కడగొట్టుపట్టి యగుటవలన తలిదండ్రులాతనికి పనిపాటలు చేయుట కంతగా నిర్బంధము కలిగింపలేదు. అతడు తఱచు వ్యవసాయపు బనులలో మెలగుచునే యుండెడివాడు; గాని అన్నలవలె అదియే పనిగ మాత్రము చేసి యెఱుగడు. ఇందులకు పెద్దన్న గారు మాత్రము కొంచెము కోపముగా నుండెడి వాడు. రెండవయాతడు ఏమియు నని యెఱుంగడు. అతని మాటలు విని యెల్లరు నానందించెడివారు.

అతని బాల్యకాలమున రాయవరమున పాఠశాల లేకుండెను. అగుటచే అతడే గాక తోడివారిలో గూడ చదువుకొనినవారు లేకపోయిరి. అయినను రచ్చసావడికి బోయి యాతడు తఱుచు పురాణము వినుచుండును. ఆ హేతువువలనను, సహజముగ మేధావియగుట వలనను, అతడు విద్యలేకపోయినను జ్ఞానమున తోడివారిని మించి పెద్దలను సమీపించెను. ఇంత చిన్నతనములో అంతజ్ఞానవంతుడగుటవలన నిరుగు పొరుగు వారందఱు నాతనిని బ్రేమించెడివారు. తలిదండ్రులకాతని యెడలగల యధిక ప్రేమకిది యొక కారణము.

జగ్గారెడ్డికిని వెంకమ్మకును చిన్నతనము నుండియు నెంతో స్నేహము. వారు తోడివారితో ఆటలాడునప్పుడు ఇద్దఱు నొక పక్షమునందే యుందురు. ఒక రాటమానివేసిన రెండవవారు గూడ మానివేయవలసినదే. ఆటలకు బోవునపుడు ఇరువురును కలిసియే పోవుచుందురు. వచ్చునపుడుగూడ అట్లే కలిసివచ్చుచుందురు. ఒకరికి ఆటలకు బోవుటకు వీలులేకున్న రెండవవారు ఇంటనే యుండిపోవుచుందురు.

జగ్గారెడ్డికి పదమూడవయేడును, వెంకమ్మకు పదవయేడును ఒక్కమాతే వచ్చెను. ఒక్కమాతే వారికి ఆటపాటలతో కాలము గడుపుటకు అభ్యంతరము గలిగెను. జగ్గారెడ్డికి వ్యవసాయపు పనులు చూడవలసివచ్చెను. వెంకమ్మకు ఇంటిపనులలో తల్లికి తోడ్పడవలసి వచ్చెను. ఈ రూపమున వారి సమావేశములకు ఆటంకము గలిగెను. గాని వారి ప్రేమ ప్రవాహమునకు మాత్రము ఏ యడ్డును గలుగలేదు. దానంతనది నిరర్గళముగ ప్రవహించుచునేయుండెను. ఈ స్వల్పవియోగము దాని యభివృద్ధికే కారణమయ్యెను.

తన బుల్లియావుదూడ నిమిత్తము సాయంకాలము చిన్న చెంగలిగడ్డిమోపు నెత్తిమీద బెట్టుకొని పాటలు పాడుకొనుచు ఇంటికి వచ్చిన వెంటనే జగ్గారెడ్డి వెంకమ్మను జూడకుండ నుండజాలకపోయెడివాడు. వెంకమ్మగూడ వెంటనే యాతనివెంట బయలుదేరకుండ నుండెడిది గాదు. ఇరువురునుగూడ దూడ వద్దకు వచ్చి దానిని ముద్దిడుకొనుచు, దువ్వుచు, బుజ్జగించుచు, నడుమనడుమ అంబాయని పిలుచుచు మేపుచుండిరి. ఆ చిన్నదూడ వారియెడల నెంతో చనువుగా ప్రవర్తించుచుండెను.

జగ్గారెడ్డి నాలుగేసి పరకల చొప్పున మెత్తగానున్న వానిని నేరితీసి దానిచే తినిపించుచు "వెంకమ్మోయి! నాబుల్లిదూడ రెండేళ్ళువరసగా రెండు గిత్తలిని పెడుతుంది. వాట్లనుగూడా ఇలాగే నేను మేపుతాను. నేనే వానిని అరక్కట్టి దున్నుతాను. ఇంకెవ్వరినీ ముట్టుకోనీయను. ముచ్చటపడితే మాబాబునిమాత్రం యెప్పుడేనా కట్టనిస్తాను. ప్రతీయేడూ శివరాత్రికి కోటిపిల్లి బండికడతాను. బండిలో మాయమ్మా, మా బాబూ వుంటారు. నువ్వుగూడా రావాలిసుమా. నేను తొట్టిలో కూచుని బండి తోలుతూవుంటాను. నువ్వు నాదగ్గిరే కూచుంటావు కదూ వెంకూ! మనం యిద్దరం ఇలాగే కబుర్లు చెప్పుకుంటాము. గిత్తలకి పెద్దగంటలూ, మువ్వలూ కడతాను. చెయ్యివేసేటప్పటికి గిత్తలు మేఘాలమీద యెగిరిపోతాయి. ప్రయాణం వారం వుందనగానే బండికి నార వేస్తాను. కోటిపిల్లి వెళ్ళివచ్చేదాకా దాన్నెవరూ ముట్టుకోగూడదు. రాయారం కోటిపిల్లి మధ్య 'జగ్గారెడ్డి బండి' అంటే 'ఓ' అనిపిస్తాను చూస్తూవుండు" అని యాతడనేక పర్యాయములు చెప్పుచుండును. "ఆగిత్తలెంతో బలిసి వుంటాయి. వాట్లకొమ్ములు సూదిగా వుంటాయి. నన్నే గాని మరెవ్వరినీ దగ్గిరకు రానీయవు. నన్నుచూసి అవి తలలూపుకుంటూ దగ్గిరకు వస్తాయి. ఇదిగో, బండికాడి వాటంతటవే కొమ్ములతో యెత్తి మెడమీద పెట్టుకుంటాయి. నేను పలుపులు మాత్రం కడతాను. కట్టకపోయినా భయంలేదులే" అని గూడ ఆతడు చెప్పుచుండును. అట్టి సమయముల యందెల్ల వెంకమ్మ ముద్దులొలుక మందహాసము గావించుచు, "ఊ,ఊ"యని తలయూపుచుండును.

జగ్గారెడ్డిని జూచి వెంకమ్మగూడ తనతండ్రికి గల యావుల మందనుండి యొక పడమటి యావుదూడ నేరికొని పెంపదొడగెను. అయితే ఆమెకు ప్రత్యేకము

చెంగలిగడ్డి యెట్లు వచ్చును? గడ్డి విషయము తలంపునకు వచ్చినపుడు ఆ బాలిక అప్రతిభయయ్యెను. "మతీ–మతీ మాపాలికాపు.....కాదు–మాబాబే తెచ్చిపెడతాడు" అని యనుకొనియెను; గాని యామెకు తృప్తి కలుగలేదు. ముఖము వికసింపలేదు. అప్పుడు జగ్గారెడ్డి ఆమె దైన్యమును చూడజాలక "ఆలాయెందుకూ? నేనింకా రెట్టింపు గడ్డి తెస్తాను. ఇద్దరమూ సెరిసగమూ పంచుకొందాము. నీ దూడనీ, నా దూడనీ తోలుకుపోయి, చెర్లో కడిగి నేనే నీళ్ళు పెట్టి గంతులేసి కాళ్ళు గుదులు తీర్చికొన్నాక తోలుకొచ్చి కట్టిపెడుతూవుంటాను. రోజుకోమాటు రోడ్డుమీదికి కూడా తీసుకెళ్ళి తిప్పుకువస్తూ వుంటాను. రోడ్డేపోయేవాళ్ళు అంతా మన దూడల్ని చూచి ఆశ్చర్యపడిపోవాలి" అనియాతడు చెప్పగా అందులకు ఆమె "తవుడూ చిట్టూ కలిపి రెండిటికీ నేనే పెడతానులే" అనియెను. ఈతీరున వారిరువురును ఆ దూడలను పెంచుభారమును పంచుకొనిరి. అప్పుడప్పుడామె "యీ బుల్లిదూడ యీనిన తరువాత కుంచెడు పాలు ఇస్తుంది. నేనే పాలు పితుకుతాను. మరెవరేనా పితికితే నా దూడకి బాధ కలిగిస్తారు. నేనే పాలు కాస్తాను. నేనే పెరుగు తోడుపెడతాను. ఆ పెరుగు ముందు నీకిచ్చి తరువాత నేనుపోసికుంటాను. మాయమ్మకీ, బాబుకీ నేనేవడ్డిస్తాను. మీ బాబు భోంచేసేటప్పుడు మీగడపెరుగు గుమ్మరించి పోతాను. మీయమ్మ కంచంలో అన్నం పెట్టుకొని మజ్జిగ మరిచిపోయి తెచ్చుకోడానికి లోపలికి వెడుతుంది. అప్పుడు మా యింటోనుంచి పెరుగు తెచ్చి కంచంలో పోసేసి వెళ్ళిపోతూవుంటాను. మీయమ్మ వచ్చేక కంచంలో పెరుగువుండడం చూసి తెల్లపోతూవుంటుంది. కదూ జగ్గూ" అని తల అడ్డముగా ఊపుచు పలుకుచుండును.

"అయితే నువ్విచ్చిన పెరుగు నేనే వడ్డించుకోవాలికామోసు. ఏమి వెంకూ, కాదూ?" అని యాతడనగా "కాదోయి! మీయమ్మ మీబాబుకి అన్నం పెడుతూ వుంటుంది. మీ అన్నయ్యలకి పులుసు వేస్తూ వుంటుంది. మీ అక్కలకి పాలూ, పెరుగూ చూస్తూ వుంటుంది. నేనువచ్చి నీకు వడ్డిస్తాను. పెరుగే కాదు. అన్నమూ, కూరా, పచ్చడీ, పులుసూ, అన్నీ నీకు నేనే వడ్డిస్తాను" అని యామె జవాబు చెప్పుచుండును. ఈవిధముగ వారిద్దరును వివాదాలు పరిష్కరించుకొనుచుందురు. ఇది విని అపుడపుడు కథల వలె చెప్పుకొనుచు వారి తల్లిదండ్రులు ఇరుగుపొరుగువారు నవ్వుకొనుచుందురు.

ఈ తీరున మూడు సంవత్సరములుగడచిపోయెను. ఇరువురకు నొక్కమాతే యౌవనమంకురించెను. వారి ముద్దుమొగములమీద నూతన తేజమును, కోమలశరీరములమీద నూతనలావణ్యమును, కూలంకషముగ ప్రవహింపదొడగెను. వెంకమ్మచూపులయందును, జగ్గారెడ్డిచూపులయందును భావబోధనశక్తియు, భావగ్రహణ శక్తియు పొడసూపెను. ఇరువురి నేత్రములును కడగంటి చూపులను పూర్తిగ నేర్చుకొనియెను; గాని యివి యన్నియు వారి యప్పటప్పటి సమావేశములకు భంగకరములయ్యెను. లోకులకు జంకివెంకమ్మను ఆమె తల్లిదండ్రులు

మునుపటివలె చనవుగా ప్రవర్తింపవలదని నిషేధించిరి. ఈ విషయమున జగ్గారెడ్డికి గూడ తలిదండ్రులు ఆజ్ఞ పెట్టిరి. ఇంతలో వెంకమ్మ రజస్వలయయ్యెను.

అయితే అప్పటికి వారికి ఈ నిషేధములకు ముఖ్యకారణము లేమో తెలిసికొనుటకు తగినంత జ్ఞానము వచ్చియుండెను. వారికంతయు దెలిసిపోయెను. ఒక్కమాఱు వారి హృదయములలో భావ యంత్రములు గిఱ్ఱున తిరిగిపోయెను. వెంటనే ఘనీభవించిన స్నేహము స్థానమున మోహము ప్రవేశించెను. ఆ మోహము ప్రణయ మయ్యెను. నడిచిమాట్లాడనేర్చినదే మొదలుగ అంకురించిన వారి స్నేహమునకుఎట్టి యాఘాతములును తగిలియుండకపోవుటవలనను, విశుద్ధస్నేహమున ప్రణయబీజములు నిహితము లయియే యుండుట వలనను మోహముదయించిన వెంటనే ప్రణయ రూపమును వహించుటకు అవధి యక్కరలేకపోయెను. క్రీగంటి చూపులును, చిఱునగవును, ఆప్రణయతరంగములకు లయ నేర్పసాగెను.

సముద్రములో బడబాగ్ని యున్నదని చెప్పెదరు; గాని దానిని జూచినవారు లేరని తోచుచున్నది. బడబానలమునకు పుస్తకములే నిదర్శనములుగా నున్నవి. జగ్గారెడ్డి పురాణములు వినునపుడు అనేకపర్యాయములు బడబానలముసంగతి వినియుండెను; గాని వెంకమ్మ యాపేరే వినియుండలేదు. వారి మానసికవృత్తులకు ఈ నూతనసంస్కారము కలిగిన తరువాత ఇద్దఱును సమానముగనే ఆబడబాగ్ని తీవ్రజ్వాలలో దగుల్కొనిరి.

నిర్బంధములలో దగిలియున్న ఆయువయువతులు ఎన్నిసారులు తగిన సమయములు సమకూరునో అన్నిసారులును గూడ రహస్యముగ సమావేశము అగుట మానలేదు. అన్నిసారులును తమ బాల్యస్నేహమును సింహావలోకనము గావించుకొనిరి. తమ నిర్బంధములకు గల కారణములు మననము గావించుకొనిరి. ఆనందముతో నొకరి చేతినొకరు గైకొనిరి; గాని లజ్జ వారిని దూరముగ గెంటివేసెను. ఇట్లెన్నియో పర్యాయములు జరిగెను.

ఇది యిట్లు జరుగుచుండగా తిరుపతిరాయడు తన కొమార్తె వివాహయోగ్యయైయున్నదని వరాన్వేషణము ప్రారంభించెను. అనేకవరులను జూచెను. ఆస్తియున్నచోట తెలివితేటలు లేకపోయెను. తెలివితేటలున్నచోట సంపదలేకపోయెను. రెండును ఉన్నచోట వరునకు ఈడు లేకపోయెను. అదియు నుండినచోట కురూపము తటస్థించెను. ఆతనికి లక్ష్మివంటి తన ముద్దుబిడ్డను కురూపికి ఇచ్చుటకు సాహసము గలుగలేదు. "అనేక కారణాలచేత జగ్గారెడ్డికి ఇవ్వడం మంచిదని తోస్తోంది. బీదవాడు కాడు. మూరుకుడు కాడు. అందంలేనివాడు కాడు. మాటలు నేర్చింది మొదలు స్నేహంగా వున్నాడు. మనకి గుమ్మంలో గుమ్మం. చాలా ఖర్చులు తగ్గిపోతాయి. పిల్లయెప్పుడూ కళ్ళకవుపడుతూ వుంటుంది" అని తిరుపతిరాయడు చెప్పగా ఆతని భార్య "నేనిప్పుడేమీ చెప్పలేను.

పెండ్లి కాలాన్ని మాబాబు పిల్లకి వెయ్యిరూపాయలిస్తాడు. అతని యిష్టంలేందే మనమేమీ చేయగూడదు" అని బదులు చెప్పెను.

వెంటనే యింటి మంగలి జొన్నాడ వెళ్ళి వేంకటరెడ్డిని తీసుకుని వచ్చెను. సంగతి యంతయు విని వృద్ధుడు "మీకు తెలవదు" అని యుపోద్ఘాతము ప్రారంభించెను. "భీమారెడ్డి ఆస్తి నీ యాస్తిలో సగం వుంటుంది. మూడు వాటాల మీద ఆఱోవంతు వుంటుంది. మనం నలుగుర్నీ వెంటపెట్టుకుని వెడితే అన్నం పెట్టలేడు. ఈ పెళ్ళితో మళ్ళీ ఋణపడతాడు. అప్పుకీ ఆస్తికీ సరిపోవడం కష్టం. తరువాత నీయాస్తి మీదికి చూపులు మళ్ళిస్తాడు. ఎదటిగుమ్మంఎప్పుడూ పోరికిమూలం. నా బిడ్డకి ముచ్చట్లు తీరవు. నీ బిడ్డకి సుఖం కలుగదు" అని యాతడు తిరుపతిరాయని యుద్దేశమును పూర్వపక్షముచేసి రావులపాలెములో మఱియొక సంబంధమును చూపెను. తన భార్య ఆసంబంధము నంగీకరించుటచే తిరుపతిరాయనికి తన సంకల్పమును మార్చుకోవలసివచ్చెను. అతడెప్పుడును మామగారి మాట కెదురాడి యెరుగడు.

యధా విధముగ రాయబారములు ముగిసిన తరువాత రావులపాలెము సంబంధమునిశ్చయమయ్యెను. వెంకమ్మ హృదయమున రాయిపడియెను. జగ్గారెడ్డి శిరమున పిడుగు పడియెను.

ఆ యువయువతుల యాబాల్యస్నేహాదికములను గమనించి తిరుపతిరాయడు వెంకమ్మనుతనకుమారునకు ఇచ్చుటకు సందేహింపడని భీమారెడ్డి యాశపడెను; గాని తిరుపతిరాయడువరాన్వేషణము ప్రారంభించిన వెంటనే సందేహపడవలసివచ్చెను. రావులపాలెపు సంబంధము నిశ్చయమగుట తెలిసినతోడనే "ఇది ముసలివాడి కుట్ర" అని నిశ్చయించుకొని ఆతడు కుమారుని వివాహము నిమిత్తము ప్రయత్నములను సాగించెను. బుద్ధిపుట్టటయే తడవుగ నాతని సంకల్పము కొనసాగెను. బలభద్రపురములో నొక చక్కని పిల్ల కుదిరెను. దీనితో జగ్గారెడ్డికి పుండుమీద కారము చల్లినట్లు అయ్యెను.

ఇదియైన తరువాత దైవోపహతులగు ఆ యువయువతుల రహస్య సమావేశమున కవకాశము చిక్కలేదు. అందులకు తోడుగ వెంకమ్మకు వివాహముహూర్తము స్థిరపడియెను. "ఈనడివానాకాలం కడచిపోనియ్యి" అని తిరుపతిరాయడు చాలవిధముల జెప్పెను; గాని వృద్ధుడంగీకరింపలేదు. శ్రావణశుద్ధ సప్తమీ శుక్రవారము నాలుగు గడియలకు ముహూర్తము నిశ్చయింపబడెను. భీమారెడ్డి జగ్గారెడ్డికి మాఘమాసము వఱకును వివాహము సేయదలపలేదు.

రాయవరమునందును రావులపాలెమునందును పెండ్లి ప్రయత్నములు ప్రారంభమయ్యెను. పదిదినములలో నన్నియు ముగిసెను. వివాహదినము సమీపించెను. ఒకనాడు శుభముహూర్తమున వెంకమ్మను పెండ్లికూతుం గావించిరి. ఊరిలోని యొక రిద్దఱు బంధువులుగూడ ఆమెను దమ యిండ్లకు దీసికొని పోయి పెండ్లికొమార్తెను గావించి సమ్మానించి పంపిరి.

వెంకమ్మకు అనపర్తిలో నొక పినతల్లి యుండెను. ఆమెగూడ వెంకమ్మను పెండ్లికూతుం జేయుటకు తీసికొని వెళ్ళెను. అక్కడ జరుగవలసిన మహోత్సవమంతయు ముగించి మఱల ఆమె వెంకమ్మను రాయవరము తీసికొని వచ్చుటకు ప్రయత్నించుచుండగా కడసారి కుమారునకు అంకాపొంకములుగ జ్వరము వచ్చెను. దానితో ఆమె యిల్లుకదులుటకు వీలులేక పదియేండ్ల ప్రాయముగల పెద్దకొడుకును జతయిచ్చి వెంకమ్మను బంపివేసెను. నాలుగుదినముల క్రిందట పశువులనుజూచి వచ్చుటకు ఆమెభర్తమన్యము వెళ్ళియుండుటచే ఈయసందర్భము తటస్థించెను.

నాడు బుధవారము. ద్వారపూడిలో గొప్పసంత జరుగుదినము. "రామభజనకి మువ్వలు కొని తెచ్చుకొంటాను." అని జగ్గారెడ్డి ద్వారపూడి వెళ్ళెను.

రాయవరమునకును అనపర్తికిని క్రోసెడునర దూరముండెను. తన యవస్థకు విచారించుచు వెంకమ్మ నెమ్మదిగా బయలుదేఱెను. ఆముద్దరాలి హృదయాకాశమున అనేకభావవిద్యుల్లతలు మెఱసిపోయెను. విచారసాగర మెన్నో మాఱులు ఉచ్చలిత మయ్యెను. ఎన్నో పర్యాయములు వివిధభావములు గ్రుద్దుకొనుట వలన ఉక్కిరిబిక్కిరి యయ్యెను. ఎన్నోసారులు కన్నుల నీరు తిరిగెను. ఎట్లు నడిచెనో యెఱుగకయే నాలుగు గడియల ప్రొద్దువేళ కామె మహేంద్రవాడ వద్దనున్న మురుగుకాలువ గట్టుమీదికి వచ్చెను.

ఆమురుగుకాలువ తుల్యానదితో కలిపి త్రవ్వబడియున్నది. వానకాలమున నది యొక చిన్ననదిని మించి యుండును. దానివడి చాల ప్రసిద్ధమైయున్నది. నడివానకాలమున ఏటేట నదియెన్ని పశువులనో తన పొట్టంబెట్టుకొనుచుండును. మహేంద్రవాడరహితులు దానిమీద తాటిపట్టెలతో నొక వంతెనను నిర్మించిరి. అది తగినంత విశాలముగనే యుండినను దాని మీద నడుచుటకు అనేకులు భయపడుచుందురు. అట్టి వంతెన మీద వెంకమ్మ ప్రాణములు అరచేత బెట్టుకొని ప్రవేశించెను. ఆమె విచారభరమ్మున తన పినతల్లికొడుకు తనవెంట వచ్చుచుండుట మఱచిపోయెను. ఆమె వంతెన మీద మధ్యకు వచ్చునప్పటికి ఒంటిగా దానిమీద నడుచుటకు ధైర్యము లేక ఆ పిల్లవాడు "అక్కా"యని పిలిచెను. అందులకు ఉలికిపడి ఆమె వెనుదిరిగి చూచెను.

ద్వారపూడినుండి బయలుదేఱి తనతో కలిసికొనుటకు వడివడిగవచ్చుచు వంతెనమీద కాలుపెట్టుటకు సిద్ధముగనున్న జగ్గారెడ్డి వెనుదిరిగి చూచిన వెంటనే యామెకు గాన్పించెను. కట్టా, ఎంత యశుభసన్నివేశము! ఆమె హృదయము వ్రక్కలై పోయెను. కన్నీటివలన దృష్టి నిరోధము కలిగెను. కంఠస్వరము రుద్ధమైపోయెను. కాళ్ళయందు కంపముదయించెను. ఇంకనేమున్నది? లావణ్యపూర్ణ యగు ఆ పెండ్లికూతరుకూలంకషయగు ఆ మురుగుకాలువలో బడిపోయెను.

చేయిజాఱిపోవుచున్న వెంకమ్మను సమీపించుచున్నానను సంతోషముతో పొంగిపోవుచున్న జగ్గారెడ్డి యిదిచూచి నిర్విణ్ణుడయ్యెను. అతనికి ప్రాపంచికజ్ఞానము విలుప్తమైపోయెను. అతనికి గూడ కాళ్ళయందువడకు పుట్టెను. అంతనాతడు "వెంకూ"యని పిలుచుచు కాలువలో నుఱికెను.

జగ్గారెడ్డి కాలువలో నుఱుక ప్రయత్నించునప్పటికి వెంకమ్మ పతనవేగము వలన మునిగిపోయెను. పిదప ఆమె తేలునప్పటికి పతనవేగమున జగ్గారెడ్డి మునిగిపోయెను. ఒకటి రెండు మాఱులు మునిగి దేలుటలో ఇద్దఱు నొక్కమాఱు తేలిరి. ఆమె కండ్లబడుటయే తడవుగ నాల్గుబార్లలో నీదుకొని పోయి యాతడామెను పట్టుకొనెను.

అముద్దుబాలకు విధి నిర్ణయించిన పాణిగ్రహణమిదియే యని మేము భావించెదము. ఇంతమాత్రమునకే ఆ పెండ్లికొడుకునకు తృప్తియైనదేమో మేము చెప్పజాలము: గాని యాతడు కుడిచేతితో ఈదుచు ఎడమచేతితో ఆమెను పట్టుకొని కండ్లు తేలవేయుచు "వెంకూ"అని పిలిచెను. అందులకు వెంకమ్మ "నువ్వు ఒడ్డుకుపో. పోయి బ్రతుకు. నాకింక బ్రతకడానికి యోగంలే"దని యాతనింద్రోసివేయబోయెను: గాని యందులకాతడు "నువ్వు బ్రతక్కపోతే నాకెందుకూ బ్రతుకు" అని యామె యాజ్ఞను తిరస్కరించెను.

అప్పటికప్పుడే యిద్దఱకు నధికాయాసము వచ్చెను. జగ్గారెడ్డి చేతులలో బలము క్షీణించి పోవుచుండెను. అది గ్రహించి వెంకమ్మ "అలా అయితే రా. ఇద్దరం ఒకచోటికే పోదాము" అని నిండు ప్రేమతో తన మనోహరుని కౌగిలించుకొనియెను. తుదినిముసమున ఆ దైవోపహతునకు ఈ పలుకులు వినబడియెను. యమపాశములు కంఠమునకు తగులుకొనక ముందే అనిరాశాసంతప్తచిత్తుని మెడలో ప్రియురాలి బాహు వల్లరులు చుట్టుకొనియెను. అవశుడై నీటిలోమునుగక పూర్వమే కోరుకొనిన వధువు అతని వక్షమున వ్రాలెను.

ఇదియైన వెంటనే ఆ దంపతులు - ఈశ్వర సాన్నిధ్యమున భార్యాభర్తలయిన ఆ యువయువతులు అదుర్భమప్రవాహమునబడి స్వర్గమునకు బోయిరి. వారి కళేబరము లెవ్వరికిని గాన్పింపలేదు. వారి హృదయములవలెనే అవి ప్రకృతిలో లీనములైపోయెను.

❀ ❀ ❀